పోషణతో పాటు విద్యను అందించాలి

సీడీపీఓ సుజాత

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా విద్యను అందించే కేంద్రాలుగా కూడా పనిచేయాలని ఐసీడీయస్ సీడీపీఓ సుజాత అన్నారు. పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమానికి సంబంధించి మూడురోజుల శిక్షణలో భాగంగా చివరిరోజైన శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి పలు అంశాలపై సూచనలిచ్చారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ) కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకోసం కేంద్రం పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, కరుణాకర్, సూపర్‌వైజర్లు శాంతమ్మ, భాను, లక్ష్మీదేవి, చంద్రకాంత, రమణమ్మ పాల్గొన్నారు.



మదనపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి సారించండి

పెద్దతిప్పసముద్రం : అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయరాణి, నాగరత్నమ్మలు వర్కర్లకు సూచించారు. శనివారం పోషణ–భీ, పఢాయీ–భీ కార్యక్రమం చివరి రోజు శిక్షణలో భాగంగా సూపర్ వైజర్లు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యవంత జీవనానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

పిల్లలకు విద్యతో పాటు సంరక్షణ ముఖ్యం

తంబళ్లపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్య, బోధనతోపాటు సంరక్షణ చర్యలు ముఖ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ నాగవేణి తెలిపారు. మండలంలోని కన్నెమడుగు, గోపిదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా పోషణ్ భీ, పఢాయిభీ కార్యక్రమంపై శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. సీడీపీఓ మాట్లాడుతూ శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల్లో చిన్నారుల పోషణ, విద్య ఆవశ్యకత, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించడం, వారి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధమ్మ, కుసుమరాణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కేవీపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలలో దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ అన్నారు. మండలంలోని వగళ్ల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం మూడో రోజు పోషన్ భీ పఢాయి భీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషణ, అభ్యసన విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహ సందర్శన ద్వారా దివ్యాంగ పిల్లలను గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దతిప్పసముద్రంలో సూచనలిస్తున్న సూపర్‌వైజర్ నాగరత్నమ్మ



తంబళ్లపల్లె : సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్ రాధమ్మ



కేవీపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

క్లుప్తంగా

గుడి అభివృద్ధికే హుండీలోని నగదు



కోటమిట్ట ఆంజనేయస్వామి, భక్తులు

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీలో వెలసిన కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు వేసిన నగదును ఆలయ అభివృద్ధికే కేటాయిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు భానుప్రకాష్ నాయుడు తెలిపారు. శనివారం హుండీ ఆదాయం లెక్కించగా రూ.25,340 వచ్చిందన్నారు. హుండీలో వచ్చిన నగదు, కానుకలను ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

భారీ ఉరుములతో వర్షం

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ ఉరుములతో భారీ వర్షం కురిసింది. 20 నిమిషాలకుపైగా భీకర శబ్దాలతో ఉరుములు భయభ్రాంతులకు గురిచేశాయి. భారీ వర్షానికి రోడ్లపై నీళ్లు ప్రవహించగా, మురికినీటి కాలువలు నిండిపోయి నీరంతా రోడ్లపైకి వచ్చింది. వీధుల్లో మట్టి చేరుకుంది. గాలికి రేకులు, బ్యానర్లు ఊడిపడ్డాయి. పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై భారీగా ఉరుములు ఉరమగా తుంపర్ల వర్షం కురిసింది.

లక్ష్మీనరసింహునికి విశేష పూజలు



స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు విశేషమైన ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ

మదనపల్లె సిటీ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మదనపల్లెలోని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రీద్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయబాబు, సమీర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


ఫారంపాండ్ పనులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ అశోక్‌రెడ్డి

పీలేరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు ఫారం పాండ్ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 42 ఫారంపాండ్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. జూన్ నెల చివరి నాటికి 250 పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 162 పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమ పొలంలో ఫారంపాండ్ పనులు చేసుకుని నీటి సంరక్షణ చేసుకోవాలన్నారు.

గుర్రంకొండలో..



ఫారం పాండ్ పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండలంలోని సంగసముద్రం పంచాయతీ మద్యాహ్నంవారిపల్లెలో ఫారం పాండ్ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన ఈ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు, మాజీ సర్పంచ్ సుంకర శేఖర, జనసేన నాయకుడు సాయి ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ మదనరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

పోలీసులకు రికార్డింగ్ డ్యాన్సుల కలవరం

కురబలకోట : మండలంలోని ముదివేడు దండు మారెమ్మ తిరునాల సందర్భంగా ఇటీవల జరిగిన రికార్డింగ్ డ్యాన్సులు అన్నమయ్య జిల్లాలోనే కాకుండా అంతటా షేక్ చేస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా విచ్చల విడిగా డ్యాన్సులు వేసినట్లు వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి. నగ్నంగా డ్యాన్సులు చేసిన వీడియోలు చూసిన వారు ముక్కున వేలేసుకుంటున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు సైతం విస్తుపోతున్నారు. దీనిపై విచారణ చేపట్టారు. ఇప్పటికే కారకులను గుర్తించి ముదివేడు పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులతో పాటు వాహనాలను సీజ్ చేశారు. శనివారం మరో రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సంబంధీకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఆటోమేషన్ ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

మదనపల్లె సిటీ : ఇంజనీరింగ్ విద్యార్థులు ఆటోమేషన్ ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ప్రోటోటైప్, ప్రాసెస్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి వాస్తవ ప్రపంచ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, రిసోర్సు పర్సన్స్ మంజునాథరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి లక్ష్మయ్య, మహమ్మద్‌షఫీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సతీష్‌బాబు

అంపశయ్యపై మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

మదనపల్లె : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలోకి మారుస్తూ, వాటికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రులను ప్రైవేట్ వ్యక్తులు, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి పేదవాడికి వైద్యం ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అనంతరం రోగులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించడంలో భాగంగా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వైద్యసిబ్బందిని తగ్గిస్తూ, వైద్యసేవలు అందించకుండా నిర్లక్ష్యం కనబరుస్తోందన్నారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి అంపశయ్యపై ఉందని, చివరికి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు బయట నుంచి మందులు తెచ్చుకుని, వైద్యం చేయించుకునే దుస్థితికి దిగజార్చేశారన్నారు. చిన్నపాటి జబ్బులతో వచ్చిన రోగులను సైతం తిరుపతికి రెఫర్ చేస్తూ, వైద్యులు చేతులు దులిపేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలను మార్చాలన్న ప్రతిపాదనలు విరమించుకోవాలని, జిల్లా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది, మందులు, వసతులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళీ, రెడ్డి, సూరి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితిపై మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గర్నిమిట్ట పంచాయతీకి రూ. 3.55 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్.

కేవీపల్లె : వారపుసంత వేలం ద్వారా మండలంలోని గర్నిమిట్ట పంచాయతీకి రూ. 3.55 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. శనివారం గర్నిమిట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో గర్నిమిట్ట వారపు సంత గేటు వసూలు హక్కు కోసం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప హెచ్చుపాట ద్వారా రూ. 3.55 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ : బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి కుటుంబీకులు ఎవరూ ముందుకు రాకపోవడంతో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు శనివారం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్, సభ్యులు జాఫర్, హనీఫ్, కిరణ్, చైతు, హర్ష, బి.కొత్తకోట పోలీసులు రామాంజులు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటిక వద్ద పూలతో నివాళులు అర్పిస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

పరీక్షలే జీవితం కాదు.. పరీక్షలు ఒక భాగం

మదనపల్లె సిటీ : పరీక్షలే జీవితం కాదు.. జీవితంలో పరీక్షలు ఒక భాగం మాత్రమేనని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ అన్నమరెడ్డి చాముండేశ్వరి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో శనివారం నైతిక విలువలు, మాదక ద్రవ్యాలపై అవగాహన, మానసిక విద్యపై సెమినార్ జరిగింది. పరీక్షల సమయంలో మానసిక ఆందోళనకు గురికాకూడదన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఇటీవల మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉందన్నారు. దీనిని అలవాటు చేసుకోవద్దని, తమ విలువైన జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాముండేశ్వరి

మదనపల్లెకు మహర్దశ తీసుకువస్తాం

మదనపల్లె : కూటమి ప్రభుత్వంలో మదనపల్లెకు మహర్దశ తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా అసెంబ్లీలో పలు సమస్యలను ప్రస్తావించానన్నారు. 26 రోజుల పాటు జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో, అభివృద్ధి, సంక్షేమం, విద్య, ముస్లిం, మైనారిటీల సమస్యలు, వక్ఫ్‌భూముల పరిరక్షణ తదితర అంశాలపై మాట్లాడే అవకాశం వచ్చిందన్నారు. పట్టణంలో ప్రజలకు ఇబ్బందికరంగా తయారైన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్లు విస్తరణ చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరామన్నారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి ప్రతిరోజు 1000 మందికి పైగా రోగులు వస్తున్న నేపథ్యంలో డాక్టర్ల కొరత లేకుండా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి, ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాల్సిందిగా వినతిచేశామన్నారు. బీటీ కళాశాల యూనివర్సిటీ, మదనపల్లె-నిమ్మనపల్లె, రామసముద్రం-మదనపల్లె డబుల్‌రోడ్డు, టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరామన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో డీకేటీ భూముల ఆక్రమణను అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వానికి సూచించామన్నారు. వక్ఫ్, ఎండోమెంట్ భూములను ఎవరైనా ఆక్రమిస్తే, వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. మున్సిపాలిటీలకు గుదిబండగా మారిన సీఎఫ్ఎంఎస్ విధానానికి ప్రభుత్వం మార్చి ఆఖరుకు స్వస్తి పలకనున్నదని, ఇకపై మున్సిపాలిటీకి వచ్చే ప్రతి రూపాయి స్థానికంగానే ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, డైరెక్టర్ సర్దార్‌ఖాన్, టీడీపీ నాయకులు ఆర్.జీ.వెంకటేష్, బాలుస్వామి, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఎండాకాలం పశుపోషణలో మెలకువలు ముఖ్యం

తంబళ్లపల్లె : ఎండాకాలంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా పాడిరైతులు పశుపోషణలో ముందస్తు మెలకువలు పాటించడం ముఖ్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర తెలిపారు. ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా పాలదిగుబడి తగ్గి నష్టపోవడమే కాక పశువులకు వడదెబ్బతగిలే ప్రమాదం ఉందన్నారు. పశువులను ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4 గంటలు పైనే మాత్రమే మేతకు వదలాలన్నారు. పశువులను చెట్ల నీడనగాని, పాకల్లో గాని కట్టివేయాలన్నారు. పాకలు శుభ్రంగా ఉంచి చుట్టూ చెట్లు పెంచడం వల్ల మంచి గాలి, వెలుతురు ఉంటుందన్నారు. పశువులకు ఎక్కువ శక్తిని ఇచ్చే పచ్చి మేత ఆహారంగా ఇవ్వాలన్నారు. పశువులు వడదెబ్బ బారిన పడితే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించి సెలైన్ ఇవ్వాలన్నారు. వేసవిలో పొదుగువాపు వ్యాధి సోకే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు పాకలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



డాక్టర్ సుమిత్ర

మౌలాకా పహాడ్‌లో ప్రార్థనలు

పెద్దమండ్యం : రంజాన్ పవిత్ర 21వ ఉపవాస దినం సందర్భంగా కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కేఎస్ఎస్ ఆరీఫుల్లా హుసేనీ ప్రార్థనలు నిర్వహించి ఫాతేహా (చదివింపులు) చేశారు. మౌలాకా పహాడ్‌లో ఫాతేహా సందర్భంగా మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్ఐలతో పాటు 70 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం మౌలాకా పహాడ్‌కు చేరుకున్న కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి కెస్ఎస్ అరీఫుల్లాహుసేనీ ఇఫ్తార్‌విందు చేసి, నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం మౌలాఅలి ముష్కిల్ ఫాతేహా (చదివింపులు) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తంబళ్లపల్లె టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి, సీడ్ మల్లికార్జుననాయుడు, ముస్లింలు పాల్గొన్నారు.



మౌలాకా పహాడ్‌లో ఫాతేహా చేస్తున్న కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి

రేషన్ కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి

సుండుపల్లె: రేషన్ కార్డు ఉన్న ప్రజలంతా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దారు దైవాదీనం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం జరిగిన డీలర్ల సమావేశంలో దైవాదీనం మాట్లాడుతూ ఈకేవైసీ కాని సభ్యులకు రేషన్(యూనిట్స్) పంపిణీ ఆగిపోతుందని తెలిపారు. మండలంలో 5900 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారని, మొత్తం 44 చౌకదుకాణాలు ఉన్నాయని తెలిపారు. కార్డులో యూనిట్స్ యొక్క ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దారు తిమ్మారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ దైవాధీనం

రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంటుకు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: భారత ప్రభుత్వ క్రీడా, యువజన వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంటు కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది యువతను ఎంపిక చేసినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ తెలిపారు. అన్నమయ్య, కడప జిల్లా వ్యాప్తంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివచ్చిన యువత వన్ నేషన్ -వన్ ఎలక్షన్ అంశంపై తమ అమూల్యమైన ప్రసంగాలను తెలియజేసినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా తమ అమూల్యమైన ప్రసంగాలను తెలియ జేసి పోటీలలో విజయం సాధించాలని అకాంక్షించారు.

విజేతల వివరాలు...

విజేతలుగా ఎంపికైన వారిలో వెంకట సాహిత్య, షేక్ అమీషా నాజ్, ప్రొద్దుటూరు దస్తగిరి బాషా, జె.పి సంజన, షేక్ అర్షియా అహ్మద్, మహమ్మద్ కౌసర్, ఆకుల కంబగిరి స్వామి, కె వెంకట సాయినాథ్ రెడ్డి, హేమంత్ కుమార్, వివేకానంద రెడ్డి ఉన్నారు.

పని ఒత్తిడితో సతమతం



ఎంపీడీఓ హరినారాయణకు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ములకలచెరువు : పని ఒత్తిడితో సతమతమవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీఓ హరినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ... ప్రస్తుతం పంచాయతీరాజ్ పరిధిలోని సుమారు 30 రకాల పనుల పర్యవేక్షణ కోసం సమయం చాలడం లేదన్నారు. వీటికి తోడు మరో 20 రకాల సర్వేలు కార్యదర్శులకు అప్పగించడంతో పని ఒత్తిడి పెరిగిందన్నారు. కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. కార్యదర్శులు ఆజాద్, రెడ్డిరాణి తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన పోలీస్ సిబ్బంది

రామసముద్రం : పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన పోలీస్ సిబ్బంది శనివారం బాధ్యతలు చేపట్టినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న నలుగురు సిబ్బంది బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లారన్నారు. పీటీఎం నుంచి హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు, మదనపల్లె వన్‌టౌన్ నుంచి కానిస్టేబుల్ మహమ్మద్‌బాషా, పురుషోత్తంకుమార్, పెద్దమండ్యం నుంచి కిరణ్‌కుమార్ రామసముద్రంకు వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో చేరండి

పీలేరు : స్థానిక కోటపల్లెలోని కేవీపల్లె ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్. ప్రసాద్ రావు ఓ ప్రకటనలో కోరారు. ఐదవ తరగతిలో 80 సీట్లతోపాటు ఆరవ తరగతిలో 64, ఏడవ తరగతిలో 55, ఎనిమిదవ తరగతిలో 46, తొమ్మిదో తరగతిలో 46 సీట్లు ఖాళీలున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం : స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఆరవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాల కోసం బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎస్ఓ మణిమాల కోరారు. బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్ లాంటి నిరుపేద బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కలకడ : మండల కేంద్రమైన కలకడలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వతరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనిత కోరారు. ఏప్రిల్ నెల11వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేసిన రాజేంద్ర ఆచారి

పీలేరు : మండంలోని శెట్టిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సొసైటీ బ్యాంకు అప్రైజర్ రాజేంద్ర ఆచారి కుమార్తె సుమలత అమెరికాలో ఉన్నారు. ఆమె తన సొంత ఊరిపై మమకారంతో శెట్టిపల్లె, శివరామపురం, లక్ష్మీపురం ప్రాథమిక పాఠాలల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు శోభారాణి, రాచపల్లె కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె : స్థానిక కేజీబీవీ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, 8వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుమతి కోరారు. ఏప్రిల్ నెల 11వతేదీలోపు బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డ్రాప్అవుట్స్ బాలికలు, అనాథలు, పేద ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

రామసముద్రం : క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రామసముద్రం ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ తల్లి దండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. అన్ని గ్రామాల్లో సంచరిస్తూ బెట్టింగ్ వ్యవహారాలను గమనిస్తూ ఉంటామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

వీరబల్లి: మండలంలోని ఆమూరి వాల్లపల్లికి చెందిన కానిస్టేబుల్ ముకుందకు చాతీ నొప్పి రావడంతో శుక్రవారం మృతిచెందారు. శనివారం ఆయన స్వగ్రామంలో లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, పోలీసు సిబ్బంది ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

SPR
SAMEERA COMPLEX, OPP ZP SCHOOL, MADANAPALLI
Short Term Coaching for
I-CET
EAMCET (EAPCET) and NEET
Classes starts from 24th March 2025
APRJC & పాలిటెక్నిక్
Classes starts from 2nd April 2025
Hostel Facility for Boys & Girls